క్లుప్తంగా

ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేత



పింఛన్ అందజేస్తున్న గ్రామ వలంటీర్ కామరాజు

మెళియాపుట్టి: మండలంలోని పెద్దలక్ష్మీపురం గ్రామానికి చెందిన బైపోతు జడ్డెన్న ప్రమాదవశాత్తు జారిపడి కాలికి గాయం కావడంతో శ్రీకాకుళంలోని జెమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. గ్రామ వలంటీర్ బైపోతు కామరాజు సుమారు 100 కిలో మీటర్లు ప్రయాణించి ఆస్పత్రికి వెళ్లి ఆదివారం వృద్ధాప్య పింఛన్ అందించారు. వలంటీర్‌ను పలువురు అధికారులు, గ్రామస్తులు అభినందించారు.

దుప్పట్లు పంపిణీ



వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

హిరమండలం: పింద్రువాడ గ్రామంలోని ఏసు క్రీస్తు ప్రార్థన మందిరంలో 50 మందికి వృద్ధులకు పాస్టర్ కె.నతనయేలు ఆధ్వర్యంలో కె.శిమ్మన్న ఆదివారం దుప్పట్లను పంపిణీ చేశారు. సర్పంచ్ ఎం.దండాసి, దమ్ము ఈశ్వరరావు, కె.సింహాచలం మాస్టర్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా అందజేత



బీమా చెక్కు అందిస్తున్న సర్పంచ్, తదితరులు

నరసన్నపేట: స్థానిక గాంధీనగర్-1లో ఇటీవల మృతి చెందిన పాట్నూరు మన్మధరావు కుటుంబానికి వైఎస్సార్ బీమా రూ.90 వేలు మంజూరైందని నరసన్నపేట సర్పంచ్ బూరల్లి శంకర్ తెలిపారు. మన్మధరావు భార్య రోజారాణికి ఈ మొత్తాన్ని ఆదివారం అందించారు. నెల రోజుల్లో బీమా మొత్తం వచ్చిందన్నారు. ఈఓ చిన్నారావు, ఉప సర్పంచ్ ఎస్.కృష్ణబాబు, వార్డు సభ్యులు గుప్త, శర్మ, నీలం, వైఎస్సార్‌సీపీ నాయకుడు బోయిన బాలకృష్ణ, ఎంపీటీసీ డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ ప్రారంభం



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న నిర్వాహకులు

సరుబుజ్జిలి: మండలంలోని సింధువాడ గ్రామంలో సంక్రాంతి పురస్కరించుకుని సీతారామ యువజన సంఘం ఆధ్వర్యంలో సబ్బ పోలినాయుడు స్మారక క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ప్రారంభమైంది. పోటీలను గ్రామ పెద్ద మీసాల రామారావు ప్రారంభించారు. ఈ పోటీల్లో 48 జట్లు పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఫైనల్ పోటీల్లో విన్నర్ టీమ్‌కు రూ.15 వేలు, రన్నర్‌కు రూ.10 వేల నగదు బహుమతి అందజేస్తామన్నారు.

పొందూరులో ఆయుర్వేద వైద్య శిబిరం



రోగులకు మందులను అందజేస్తున్న ఎస్ఐ లక్ష్మణరావు, డాక్టర్ సునీల్

పొందూరు: స్థానిక ప్రశాంతి క్లినిక్‌లో ఆదివారం ఉచిత ఆయుర్వే వైద్య శిబిరం నిర్వహించారు. రణస్థలం పీహెచ్‌సీ వైద్యాధికారి సునీల్ కుమార్ రోగులకు వైద్య సేవలందించారు. కీళ్ల నొప్పి, నడుమునొప్పి, మోకాళ్ల నొప్పి, ఆస్తమా, పైల్స్, బీపీ, షుగర్ తదితర వ్యాధులకు సంబంధించిన 83 మంది రోగులకు ఉచితంగా మందులను అందజేశారు. ఎస్ఐ లక్ష్మణరావు, లాబ్‌టెక్నీషియన్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక రేపు

పాతపట్నం: విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక ఈ నెల 9వ తేదీ ఉదయం పది గంటలకు పాతపట్నం సబ్ డివిజన్ కార్యాలయం వద్ద నిర్వహించనున్నారు. ఈ మేరకు ఏపీఈపీడీసీఎల్ టెక్కలి ఈఈ జి.శంకరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫోరం చైర్మన్, విశ్రాంత న్యాయమూర్తి బి.సత్యనారాయణ అధ్యక్షతన ఈ ఉంటుందన్నారు. పాతపట్నం సబ్ డివిజన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులందరూ తమ సమస్యలతోపాటు విద్యుత్ నిర్వహణపై తగిన సూచనలు అందించాలని కోరారు.

పేదింటి మహిళలకు.. గృహయోగం

- శరవేగంగా జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణ పనులు
- సొంత ఇంటి కళ.. నెరవేరుతున్న వేళ
- లబ్ధిదారుల క(ఇ)ళ్లల్లో ఆనందం



ఈ ఫొటోలో ఉన్న ఈమే పేరు గుడివాడ ధనలక్ష్మి. తురకపేట గ్రామం, ఎల్.ఎన్.పేట మండలం. సొంత ఇంటి స్థలం కూడా లేని పేదరికం. ఈమెకు పెళ్లి అయి 25 ఏళ్లు అవుతుంది. సొంత స్థలం, ఇల్లు లేకపోవటంతో కన్నవారి ఇంట్లోనే ఉంటూ తురకపేట సెంటర్లో టీదుకాణం నడుపుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత ఇంటి స్థలం, కాలనీ ఇల్లు మంజూరైంది. ఇప్పుడు సొంత ఇంటి స్థలంతో పాటు పక్కా ఇల్లు కట్టుకుంటున్నారు. సంక్రాంతి తరువాత గృహ ప్రవేశం చేసేందుకు సిద్ధం అవుతున్నారు. జీవితకాలం జగనన్నకి రుణపడి ఉంటామని సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ప్రగతి పర్వం

ఎల్.ఎన్.పేట మండలంలో ఇదీ పరిస్థితి..
మండలంలో మొత్తం గ్రామ సచివాలయాలు: 12
ఇళ్ల స్థల పట్టాలు పొందిన లబ్ధిదారులు: 342
కాలనీ ఇళ్లు మంజూరు అయిన లబ్ధిదారులు: 342
కాలనీ ఇళ్లు ప్రారంభమైన గ్రామాలు: తురకపేట, దబ్బపాడు, మిరియాపల్లి, కరకవలస, ధనుకువాడ, పెద్దకొల్లివలస, సమంతాపురం, బొత్తాదసింగి, చొర్లంగి, లక్ష్మీనర్సుపేట, గొట్టిపల్లి.
మొత్తం యూనిట్ కాస్టు: రూ.1.80లక్షలు (90 రోజుల పనిదినాలతో కలిపి)
పునాది మట్టితవ్వితే చెల్లించే బిల్లు: రూ.20 వేలు
పునాది స్థాయి పూర్తయితే చెల్లించే బిల్లు: రూ.70 వేలు



తురకపేటలో కాలనీ ఇళ్ల నిర్మాణం

ఎల్.ఎన్.పేట: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారం చేపడితే తమ ఆశలు తీరుతాయని పేదలంతా భావించారు. ఇళ్ల స్థలాలు ఇచ్చి. ఇళ్లు కడతారని ఎంతో మంది పేదలు ఆశించారు. నమ్మకంతో ఓట్లేసిన పేదల ఆశలు తీరే రోజులు వచ్చాయి. వారి నమ్మకం నిలబెట్టుకున్న జగనన్న అధికారం చేపట్టిన తరువాత పేదింటి మహిళలకు ఇళ్ల స్థలాలు ఇచ్చారు. ఇప్పటివరకు ఇంటి స్థలం లేని పేదలు స్వంత ఇంటి స్థలాన్ని సంపాదించుకున్నారు. స్థలం పొందిన మహిళల పేరుతో కాలనీ ఇళ్లు మంజూరు కావటంతో ఇప్పుడు ఇళ్ల నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి.

జనగనన్న పాలనలో...

గ్రామ వలంటీర్లు, గ్రామ సచివాలయ ఉద్యోగులు ఇంటింటికీ తిరిగి సర్వే చేశారు. నిజమైన పేదలకే ఇళ్ల స్థలాలు ఇచ్చారు. రాజకీయ నాయకుల ప్రమేయం లేకుండా, అర్హతే ప్రమాణికంగా, రాజకీయ పార్టీలతో పనిలేకుండా, ఏ పార్టీ అయినా పేదవారు అయితే ఇళ్ల స్థలాలు మంజూరు చేశారు. వారికే కాలనీ ఇళ్లు ఇచ్చారు.

చంద్రబాబు పాలనలో...

చంద్రబాబు పాలనలో టీడీపీ నాయకులు, జన్మభూమి కమిటీ సభ్యులు చెప్పిన వారికే కాలనీ ఇళ్లు వచ్చేవి. పాత ఇంటికి, ఇళ్లు కట్టకుండా కట్టినట్లు కలరింగ్ ఇచ్చి అధికారులను భయపెట్టి, ప్రలోభపెట్టి నిధులు స్వాహా చేసుకునేవారు. నిజమైన లబ్ధిదారులు ఇళ్లు కట్టుకుంటామని అధికారులు చుట్టూ తిరిగినా ఫలితం లేకుండా పోయేది.

తక్షణమే బిల్లు చెల్లింపు



ఇంటి నిర్మాణ పనులు ప్రారంభించి మట్టి తవ్వకం, నిర్మాణ సామగ్రి తీసుకువస్తే రూ.20 వేల బిల్లు చెల్లిస్తాం. పునాది స్థాయితో నిర్మాణం పూర్తయితే మరో రూ.70 వేలు చెల్లిస్తాం. ఇంటి నిర్మాణం పనులు మూడు నెలల్లో పూర్తిచేయాలి. నిర్మాణ పనుల స్థాయి మేరకు రూ.1.80 లక్షలు చెల్లించటం జరుగుతుంది. ఇందులోనే ఉపాధి హామీ పథకం ద్వారా వేతనాలు చెల్లించటం జరుగుతుంది.

– కె.రమేష్, హౌసింగ్ ఎఈ, ఎల్.ఎన్.పేట

అంగన్‌వాడీలు విధుల్లో చేరాలి



మాట్లాడుతున్న ఎంపీపీ, నాయకులు

నరసన్నపేట: అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాల విధుల్లో చేరాలని నరసన్నపేట ఎంపీపీ ఆరంగి మురళి, పోలాకి మండల పరిషత్ ప్రత్యేక సలహాదారుడు ముద్దాడ బైరాగినాయుడు విజ్ఞప్తిచేశారు. స్థానిక పార్టీ కార్యాలయం వద్ద జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చింతు రామారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు రాజాపు అప్పన్నతో కలిసి వీరు ఆదివారం విలేకర్లతో మాట్లాడారు. కార్యకర్తలు, ఆయాలు న్యాయమైన కోర్కెలను ప్రభుత్వం పరిష్కరించేందుకు సిద్ధంగా ఉందన్నారు. అంగన్‌వాడీలకు వేతనాలు అధికంగా ఇచ్చే రాష్ట్రాల్లో దేశంలోనే ఏపీ మూడో స్థానంలో ఉందని గుర్తుచేశారు. మంచి మనసుతో ఆలోసించి సమ్మె విరమించాలని కోరారు. పార్టీ నాయకులు బొబ్బాది ఈశ్వరరావు, దుల్ల రమణ, బగ్గ రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

పట్టుదలతో చదవాలి



విద్యార్థులతో శిబిచక్రవర్తి, తదితరులు

నరసన్నపేట: విద్యార్థులు పట్టుదలతో చదివితే అనుకున్న లక్ష్యాలు సాధించవచ్చని మేఘాలయ కేడర్ ఐఏఎస్ అధికారి, నరసన్నపేట మండలం జమ్ము జనజాగృతి గౌరవ అధ్యక్షుడు సాదు శిబి చక్రవర్తి అన్నారు. జమ్ము జనజాగృతి సొసైటీ ఆధ్వర్యంలో స్థానిక గీతాంజలి స్కూల్లో నవోదయ మోడల్ పరీక్షను ఆదివారం నిర్వహించారు. మొదటి పది ర్యాంకులు సాధించిన విద్యార్థులకు మోమెంటోలను శిబి చక్రవర్తి అందించారు. జమ్ము జనజాగృతి అధ్యక్షుడు, లావేరు తహసీల్దార్ దిలీప్ చక్రవర్తి మాట్లాడుతూ నవోదయ నమూనా పరీక్షకు 250 మంది హాజరయ్యారని తెలిపారు. ప్రతీ సంవత్సరం నమూనా పరీక్ష నిర్వహిస్తూ విద్యార్థుల్లో పరీక్షల భయాన్ని తొలగిస్తున్నామన్నారు. సొసైటీ సభ్యులు మామిడి అప్పన్న, బి.ధనుంజయదేవ్, టెంక శ్రీను, చల్ల అప్పన్న, ఎ.శ్రీను, గీతాంజలి స్కూల్ కరస్పాండెంట్ ఆర్.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సందడిగా సంక్రాంతి సంబరాలు



ఎస్సీ బాలికల వసతి గృహంలో భోగీ మంట వేసిన విద్యార్థులు

నరసన్నపేట: స్థానిక బీసీ, ఎస్సీ బాలికల వసతి గృహాల్లో సంక్రాంతి సంబరాలను ఆదివారం సందడిగా నిర్వహించారు. విద్యార్థినులు సంప్రదాయ వస్త్రాలు ధరించిచారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. హరిదాసుల వస్త్రాధారణలో విద్యార్థులు ఆకట్టుకున్నారు. బీసీ బాలికల వసతి గృహంలో జిల్లా బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ అనురాధ పాల్గొన్నారు. ఇటువంటి సంబరాల ద్వారా సంక్రాంతి వేడుకల గురించి ఈతరం పిల్లలకు తెలియజేయడం మంచిదన్నారు. అలాగే ఎస్సీ బాలికల వసతి గృహంలో నిర్వహించిన సంబరాల్లో బీసీ వెల్ఫేర్ అసిస్టెంట్ ఆఫీసర్ త్రినాథరావు పాల్గొని విద్యార్థులకు అభినందించారు. బీసీ, ఎస్సీ బాలికల వసతి గృహ మేట్రిన్లు పద్మావతి, ప్రభావతితో పాటు వసతి గృహాల సిబ్బంది పాల్గొన్నారు.



ఎస్సీ బాలికల వసతి గృహంలో భోగీపాలు పొంగించే కార్యక్రమం నిర్వహిస్తున్న విద్యార్థులు



బీసీ వసతి గృహంలో నృత్యం చేస్తున్న విద్యార్థులు, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ అనురాధ

చురుగ్గా ఏబీ రోడ్డు నిర్మాణ పనులు



రోడ్డు నిర్మాణం చేపడుతున్న దృశ్యం

ఎల్.ఎన్.పేట: మండలంలోని ముంగెన్నపాడు నుంచి స్కాట్‌పేట వరకు ఆలికాం-బత్తిలి (ఏబీ) రోడ్డు నిర్మాణం పనులు చేపడుతున్నామని ఆర్‌అండ్‌బీ ఏఈ కిరణ్‌కుమార్ ఆదివారం తెలిపారు. మండలం పరిధిలో కొన్నిచోట్ల పూర్తిగా పాడైన రోడ్డు అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. 6 కిలో మీటర్ల మేర రోడ్డు అభివృద్ధి పనుల కోసం రూ.2.04కోట్ల నిధులు విడుదల అయ్యాయన్నారు. మరో ఐదు రోజుల్లో రోడ్డు నిర్మాణం పనులు పూర్తిచేస్తామని తెలిపారు.

నేడు పింఛన్ల పంపిణీ

నరసన్నపేట: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సోమవారం మండలంలో పింఛన్ల పంపిణీ సభ నిర్వహించనున్నామని, లబ్ధిదారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు ఉదయం పది గంటలకు తరలిరావాలని ఎంపీపీ ఆరంగి మురళి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చింతు రామారావు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. మండలంలో కొత్తగా 115 మందికి పింఛన్లు మంజూరయ్యాయన్నారు. వీరితోపాటు పాత పింఛన్‌దారులకు జనవరి నుంచి పెంచిన పింఛన్ మొత్తాన్ని రూ.3 వేలు పంపిణీ చేస్తామన్నారు.

ఉపాధ్యాయ వృత్తి గొప్పది



మాట్లాడుతున్న రాధాకృష్ణ

పాతపట్నం: గురుకుల విద్యా వ్యవస్థ నుంచి ప్రస్తుతం కృత్రిమ మేధ విధానం వరకు విద్యాబోధనలో గురువు స్థానాన్ని ఎవరూ భర్తీ చేయలేరని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీత చౌదరి రాధాకృష్ణ అన్నారు. పాతపట్నం బ్రహ్మణ వీధిలో ఉన్న విజ్ఞాన్ పాఠశాలలో రామరాజు చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు పి.రామరాజు ఆధ్వర్యంలో జాతీ ఉత్తమ ఉపాధ్యాయ సదస్సు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ గురువులు గురుతరమైన బాధ్యత నిర్వహిస్తున్నారన్నారు.

టాలెంట్ టెస్ట్‌కు విశేష స్పందన

సారవకోట: మండలంలోని అలుదు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించిన టాలెంట్ టెస్ట్‌కు 200 మంది విద్యార్థులు హాజరయ్యారు. విజయాంబికా యువజన సంఘం ఆధ్వర్యంలో 8 నుంచి 10వ తరగతి విద్యార్థులకు జిల్లా స్థాయి వ్యాసరచన పోటీలు నిర్వహించారు. టాలెంట్ టెస్టుతోపాటు 8 నుంచి 10 తరగతి విద్యార్థులకు.. విద్యార్థులపై మొబైల్ ప్రభావం, ఇంటర్మీడియెట్, డిగ్రీ విద్యార్థులకు సమాజాభివృద్ధిలో యువజన సంఘాల పాత్రపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలకు ఈ నెల 12న వివేకానంద జయంతి నాయుడు బహుమతులు అందజేయనున్నట్లు యువజన సంఘం అధ్యక్షుడు చల్లా ఆనందరావు తెలిపారు.

ఉచిత కుట్టు శిక్షణ శిబిరం ముగింపు



కుట్టు శిక్షణ సర్టిఫికెట్లతో మహిళలు

పొందూరు: స్థానిక సత్యసాయి సేవా మందిరంలో గత నెల రోజులుగా నిర్వహిస్తున్న ఉచిత కుట్టు శిక్షణ శిబిరం ఆదివారంతో ముగిసింది. శిక్షణ తీసుకున్న 23 మంది మహిళలకు సర్టిఫికెట్లు అందజేశారు. సత్యాసాయి సేవా సమితి జిల్లా అధ్యక్షుడు వై.లింగరాజు, మండల కన్వీనర్ రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల రహదారులకు మహర్దశ

- నాలుగు రోడ్ల నిర్మాణానికి రూ.6.95 కోట్ల మంజూరు
- మరో నాలుగు రోడ్లు నిర్మాణానికి రూ.6.15 కోట్లతో ప్రతిపాదనలు
- పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి



ఎల్.ఎన్.పేట: పాతపట్నం నియోజకవర్గంలోని పలు గిరిజన గ్రామాల రహదారులను మెరుగుపర్చేందుకు నిధులు మంజూరయ్యాయని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బలహీన గిరిజన సమూహ గ్రామాలకు (పివిటిజి) పథకం ద్వారా నిధులు విడుదల చేయటం జరిగిందన్నారు. నియోజకవర్గంలోని మెళియాపుట్టి మండలం ఆల్ ఆంధ్రా రోడ్డు నుంచి కొత్తపేట మీదుగా కూర్మన్నపేట గ్రామం వరకు కిలో మీటరు మేర బీటీ రహదారి నిర్మాణానికి రూ.95 లక్షలు, నేలబొంతు రోడ్డు నుంచి అనంతగిరి, రింపి గ్రామాల మీదుగా అంపురం గ్రామం వరకు 3.60 కిలో మీటర్ల రోడ్డు నిర్మాణానికి రూ.3 కోట్లు, టీజీ (టెక్కలిపట్నం-గొప్పిలి) రోడ్డు నుంచి సంత లక్ష్మీపురం గ్రామం మీదుగా గంగన్నపేట గ్రామం వరకు 2.5 కిలో మీటర్ల రోడ్డు నిర్మాణానికి రూ.2 కోట్లు, పాతపట్నం మండలం పీటీ (పాతపట్నం-టిక్కలి) రోడ్డు నుంచి ద్వారకాపురం గ్రామం వరకు 690 మీటర్ల బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.75 లక్షల నిధులు విడుదల అయ్యాయన్నారు. వీటితో పాటు కొత్తూరు మండలం గొట్టిపల్లి రోడ్డు నుంచి పెద్దరాజపురం గ్రామం వరకు 3 కిలో మీటర్ల రోడ్డు నిర్మాణానికి రూ.2.90 కోట్లు, గొట్టిపల్లి-పెద్దరాజపురం రోడ్డు నుంచి చిన్నరాజపురం గ్రామం వరకు 1.20 కిలో మీటర్ల రోడ్డుకు రూ.1.40 కోట్లు, దిగువ మల్లెలగూడ నుంచి ఎగువ మల్లెలగూడ వరకు 900 మీటర్ల బీటీ రోడ్డుకు రూ.85 లక్షల నిధులు మంజూరు చేయాలని కోరుతూ ప్రతిపాదనలు పంపించటం జరిగిందన్నారు. ఇప్పటికే నిధులు మంజూరైన రోడ్ల నిర్మాణం పనులు టెండర్ దశ పూర్తి చేసుకున్నాయన్నారు. ఇంజినీరింగ్ అధికారులకు పనులు వేగవంతం చేయాలని ఆదేశించినట్లు పేర్కొన్నారు.

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



పాతపట్నం: పింఛన్లను పంపిణీ చేస్తున్న ప్రదీప్

పాతపట్నం: ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సవిరిగాన ప్రదీప్ అన్నారు. మండల కేంద్రంలోని కొత్తగా మంజూరైన పింఛన్లను ఆదివారం పంపిణీ చేశారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పింఛన్‌ను రూ.3 వేలకు పెంచారన్నారు. పార్టీ మండల యువజన విభాగం అధ్యక్షుడు జి.రాము, నడిమింటి గోవిందరావు, అందవరపు రాజు, ఎన్ని రామారావు, బెవర తవిటి నాయుడు, హరి, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

కొత్తూరులో..



కొత్తూరు: మెట్టూరు బిట్-1 ఆర్‌ఆర్ కాలనీలో పింఛన్లు పంపిణీ చేస్తున్న శ్రీనివాసరావు

కొత్తూరు: మండలంలోని మెట్టూరు బిట్-1 ఆర్‌ఆర్ కాలనీ, గురండి గ్రామాల్లో ప్రభుత్వం నూతనంగా మంజూరు చేసిన పింఛన్‌లతోపాటు పెంచిన పింఛన్లను వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి బూర్లె శ్రీనివాసరావు, గురండి సర్పంచ్ బోర సింహాద్రి నాయుడు ఆదివారం పంపిణీ చేశారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పింఛన్ల మొత్తాన్ని రూ.2,750 నుంచి రూ.3 వేలకు పెంచారన్నారు. ఇచ్చిన మాట తప్పని నేత సీఎం జగన్ అని అన్నారు.

పిక్నిక్ సందడి



చిన్నారులకు బహుమతులు అందజేస్తున్న జడ్జి మణి, న్యాయవాదులు

ఆమదాలవలస రూరల్: గాజులకొల్లివలస సమీపంలోని సంగమేశ్వర ఆలయం తోటల వద్ద జూనియర్ సివిల్ కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షురాలు కణితి విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన పిక్నిక్ సందడిగా జరిగింది. న్యాయవాదులు, వారి కుటుంబ సభ్యులు ఆటపాటలతో సందడి చేశారు. ఆటల్లో గెలుపొందిన చిన్నారులకు బహుమతులు అందజేశారు. నిత్యం కోర్టులో బిజీగా ఉండేవారందరూ ఒకేచోట ఆనందంగా గడిపారు. జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ఎస్.మణి, సీనియర్ న్యాయవాదులు హనుమంతు ప్రసాదరావు, చాపర రమేష్, కిల్లి మార్కండేశ్వరరావు, బూర్లె సీతారాం, తమ్మినేని అన్నంనాయుడు, చింతాడ సత్యనారాయణ, బొడిగి రమణ తదితరులు పాల్గొన్నారు.

అయోధ్య రాముడి అక్షతలు పంపిణీ



అక్షితలు అందజేస్తున్న దృశ్యం

ఆమదాలవలస రూరల్: అయోధ్య రామ మందిరం ప్రతిష్ట నేపథ్యంలో బాలరాముడిని పూజించిన అక్షతలను ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో వంజంగి గ్రామంలో ఆదివారం పంపిణీ చేశారు. ఈ నెల 22న అయోధ్య రామమందిర ప్రతిష్టలో పాల్గొనాలని కోరారు. ప్రతీ హిందువు ఇంటిని అందంగా అలంకరణ చేసి, దీపాలు వెలిగించి తమ భక్తిని చాటాలన్నారు. శ్రీరామ తారక మంత్రాన్ని ప్రతీరోజూ 108 సార్లు జపించాలన్నారు.

బెంతు ఒరియాలను ఎస్టీ జాబితాలో చేర్చొద్దు



నిరసన తెలియజేస్తున్న ఎస్టీ నాయకులు

పాతపట్నం: బెంతు ఒడియాలను ఒడియా ఎస్టీ జాబితాలో కలపొద్దని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాబయోగి అన్నారు. మండల కేంద్రంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బైదలాపురం సింహాచలం, సలహాదారులు అజారి రామారావు, ఆసరి కర్ణారావు, సుందరాడ తవిటినాయుడు, రాంబాబు, డోల్లు శ్రీనివాసరావు, డి.శ్రీనివాస్, పలువురు గిరిజనులు, తదితరులు పాల్గొన్నారు.